క్లుప్తంగా

వైద్యసేవలను మరింత మెరుగు పరచాలి



సీహెచ్‌సీ నిర్వహణ తీరును వివరిస్తున్న వైద్యాధికారి రాజ్‌కుమార్

కపిలేశ్వరపురం: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో వైద్య సేవలను మరింత మెరుగుపర్చాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు వైద్యులకు సూచించారు. శనివారం సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ సభ్యులు, ఎంపీడీఓ కె.రత్నకుమారి, వైద్యాధికారి పి.రాజ్‌కుమార్, సభ్యులు నేతల అన్నవరం, సంగాని సత్యనారాయణ, మేకా సత్యకుమారి, కార్యదర్శి కె.శివచక్రవర్తి పలు అంశాలపై చర్చించారు. డాక్టర్ రాజ్‌కుమార్ ఆసుపత్రి నిర్వహణ తీరును వివరించారు. ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ సీహెచ్‌సీలో వైద్య సేవల మెరుగుదలకు ప్రభుత్వం అన్ని విధాలా కట్టుబడి ఉందన్నారు.

సింహాచలానికి పలువురి పరామర్శ

కపిలేశ్వరపురం: మాతృ వియోగంతో బాధపడుతున్న మండపేట మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మండల నాయకుడు నక్కా సింహాచలాన్ని వెదురుమూడిలోని తన నివాసంలో జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు శనివారం పరామర్శించారు. ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, ఉమ్మిడిశెట్టి వీర వేణి, జిత్తుక వెంకటలక్ష్మి, గొల్లపల్లి సోనియా, వైఎస్సార్ సీపీ నాయకులు సాధనాల శివ, చిక్కాల రాంబాబు, పిప్పర సంపతరావు, వెదురుమూడి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

మండపేట: ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ 7.94 లక్షలను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పదిమంది లబ్ధిదారులకు అందించారు. శనివారం టీడీపీ కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా అనారోగ్య బాధితుల కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు



మాట్లాడుతున్న కమిషనర్ రంగారావు

మండపేట: పట్టణ ప్రజలు ఆధార్ నవీకరణ చేసుకోవడం కోసం ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు కమిషనర్ రంగారావు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి మొదలై 24 వరకూ కేంద్రాలు పని చేస్తాయన్నారు. మళ్లీ 27 నుంచి 30 వరకూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో శిబిరాలు ఉంటాయన్నారు. 21, 22 తేదీల్లో 11వ వార్డు ప్రకాశం మున్సిపల్ స్కూల్లోనూ, 23, 24న 21వ వార్డు రావులపేట జనార్దన మున్సిపల్ స్కూల్‌లోని అంగన్‌వాడీ కేంద్రం, 27, 28న సత్యశ్రీ రోడ్డులోని ఎస్ఎస్‌వీ మున్సిపల్ పాఠశాల, 29, 30 తేదీల్లో 7వ వార్డు బాపూజీ స్కూల్ ఆవరణలో ఆధార్ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశామని వివరించారు. పుట్టిన బిడ్డ దగ్గర నుంచి ఆరేళ్ల వయస్సు గల పిల్లలు తప్పనిసరిగా కొత్త ఆధార్ నమోదు, నవీకరణ చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

రాయవరం: జవహర్ నవోదయ విద్యా సమితి ఆరవ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్ష జిల్లాలో శనివారం ప్రశాంతంగా ముగిసింది. అమలాపురంలో మూడు, రాజోలులో రెండు, ముమ్మిడివరంలో రెండు, మండపేటలో మూడు, రావులపాలెంలో రెండు, రామచంద్రపురంలో రెండు, కొత్తపేట, పి.గన్నవరంలో ఒక్కొక్క పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 11.30 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా, మధ్యాహ్నం 1.30కి పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా 16 పరీక్షా కేంద్రాల్లో 3,869 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 2,805 మంది హాజరయ్యారు. 1,064 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. అమలాపురంలోని పరీక్షా కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా, ముమ్మిడివరం, పి.గన్నవరం పరీక్షా కేంద్రాలను జవహర్ నవోదయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కేఆర్ కృష్ణయ్య తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో డాక్టర్ బాషా తెలిపారు.

448 మంది హాజరు

మండపేట: జవహర్ నవోదయ విద్యాలయలో ఆరో తరగతిలో చేరేందుకు విద్యార్థులకు నిర్వహించిన ప్రవేశ పరీక్షకు మండల వ్యాప్తంగా మొత్తం 448 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈవో నాయుడు రామచంద్రరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పరీక్షల నిమిత్తం పట్టణంలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. గౌతమి పాఠశాలలో 199 మంది విద్యార్థులకు గాను 131 మంది, బాలికోన్నత పాఠశాలలో 216 మందికి గాను 159 మంది, ఏడిద రోడ్డు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 216 మందికి గాను 158 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. మొత్తం 631 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 183 మంది హాజరు కాలేకపోయారని వివరించారు.

ప్రాణం విలువ తెలుసుకో మిత్రమా!

- మానవ తప్పిదాలతో రహదారి ప్రమాదాలు
- ఛిద్రమవుతున్న కుటుంబాలు
- శాపంగా పరిణమిస్తున్న పాలకుల నిర్లక్ష్యం
- రహదారి భద్రతా మాసోత్సవాలతో అవగాహన



అంగరలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రవికుమార్

కపిలేశ్వరపురం: రహదారి ప్రమాదం కుటుంబంలోని సంతోషాలను హరించి వేస్తోంది. మనిషి నిండు నూరేళ్ల జీవితాన్ని నిర్లక్ష్యం కాటేస్తుంది. ప్రమాదాల్లో అత్యధిక భాగం మానవ తప్పిదాల వలనే జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. దీనికి తోడు పాలకుల నిర్లక్ష్యం ప్రమాదాల తీవ్రతను మరింత పెంచుతున్నాయి. రహదారుల నిర్వహణ, ప్రభుత్వ వ్యవస్థలను బలోపేతం చేయకపోవడం తదితర కారణాలు ప్రమాదాలకు మరో కారణంగా పరిణమిస్తున్నాయి. ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా ప్రత్యేక కథనం.

మాసోత్సవాల నిర్వహణ ఇలా..

దేశవ్యాప్తంగా జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నారు. కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ జాతీయ జాతీయ స్థాయిలో ప్రమాదాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. పోలీసు శాఖ, రోడ్డు రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి 15 వరకూ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, రహదారి భద్రతా చర్యలను చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలిచ్చారు. ఈ నెల 16న జిల్లా కలెక్టరేట్‌లో ఈ మేరకు నిర్దేశించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన అధ్యక్షతన ఆర్‌అండ్‌బీ, పోలీసు, విపత్తులు తదితర ప్రభుత్వ శాఖల అధికారులతో జిల్లా రహదారుల భద్రతా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజా సమూహాల వద్ద అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

536 ప్రమాదాలు.. 164 మంది మృతి

2024 జనవరి 8న కాలేరు–నల్లూరు రహదారిలో రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. అదే ఏడాది ఫిబ్రవరి 15న తాపేశ్వరం రోడ్డుపై లారీ, మోటారు బైక్ ఢీకొన్న ఘటనలో అంగరకు చెందిన ఇంటర్ విద్యార్థి పడాల మధుసాయి మణికంఠ (17) మృతి చెందాడు. 2024 మార్చి 2న సోమేశ్వరంలో ఆటో, కారు ఢీకొన్న ఘటనలో ఐదుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. 2023 జూన్ 3న వెల్ల గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు నల్గొండ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. 2023 డిసెంబర్ 3న మారేడుబాక వంతెన వద్ద 11 ఏళ్ల మాడెం ప్రవీణ్ కారు ఢీకొని మృతి చెందాడు. 2023 జనవరి 3న వెంకటాయపాలెం వంతెన వద్ద అదే గ్రామానికి చెందిన ఇద్దరు మోటారు బైక్‌పై ప్రయాణిస్తూ జారి పడి గాయాలపాలయ్యారు. 2023 14న పసలపూడి–మాచవరం మధ్య కోళ్లఫారం వద్ద ధాన్యం లోడు ట్రాక్టరు బోల్తా పడింది. ఇలా.. జిల్లాలో 2024లో 449 రహదారి ప్రమాదాలు సంభవించగా 23 ప్రాంతాల్లో అత్యధిక ప్రమాదాలు జరిగినట్టు అధికారులు గుర్తించారు. జిల్లాలో 2023లో 536 ప్రమాదాలు జరగ్గా 164 మంది మృతి చెందారు. వాటిలో మరణానికి కారణమైన ప్రమాదాలు 152 కాగా, తీవ్ర గాయాలకు కారణమైనవి 95, స్వల్ప గాయాలకు కారణమైనవి 289 ఉన్నాయి.

నిబంధనలపై నిర్లక్ష్య వైఖరి

రోడ్డు ప్రమాదానికి అనేక కారణాలు తోడవుతుంటాయి. వ్యక్తిగత నిర్లక్ష్యం మానవ తప్పిదం కాగా పాలకుల రహదారి నిర్వహణా లోపాలు ప్రమాద భరితంగా మారుతున్నాయి. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపడం, ద్విచక్ర వాహనాలపై ఇద్దరికి మించి ప్రయాణించడం, మలుపులలో వేగ నియంత్రణ లేకుండా వెళ్లడం తదితర కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల బారిన పడుతున్న వారిలో 18–45 ఏళ్ల వయస్సు గలవారు 66.5 శాతం మంది ఉంటున్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు వాహనాన్ని నడిపే అర్హత వయస్సు సహజంగా ఉండదు. మండపేట, రామచంద్రపురం పట్టణాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు కొంతమంది ఇంటర్ విద్యార్థులు వాహనాలపై రయ్ మంటూ వెళుతుండడం పలువురిని విస్మయానికి గురి చేస్తోంది.

పాలకుల నిర్లక్ష్యమే శాపం

దేశంలో ప్రతి నాలుగు నిమిషాలకు ఒకరు చొప్పున రహదారి ప్రమాదాల్లో చనిపోతున్న తీవ్రత నేపథ్యంలో మాసోత్సవాలకు ప్రాధాన్యత ఏర్పడింది. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో అనేక మలుపులు ప్రమాదభరితంగా ఉన్నాయి. సంక్రాంతికి ముందు వరకూ రహదారులు ఛిద్రమై లోతైన గుంతలుగా దర్శనమిచ్చాయి. తాము అధికారంలోకి రాగానే రహదారులకు మహర్దశ పడుతుందంటూ గొప్పలు చెప్పుకున్న కూటమి నేతల మాటలు నీటి మూటలయ్యాయి. సంక్రాంతికి ముందు కేవలం లోతైన గుంతలను మాత్రమే పూడ్చింది. వాటిని సైతం అరకొరగా చేపట్టడంతో ఓటేసిన ప్రజలు ముక్కున వేలేసుకున్నారు. జిల్లాలో 23 బ్లాక్‌స్పాట్‌లున్నట్టు అధికారులు గుర్తించారు. ఆయా ప్రదేశాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాల్సి ఉంది. రహదారుల వెంబడి పెరిగిన పొదలను తొలగించాల్సి ఉంది.

అవగాహనే ఆయుధం

రహదారి భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గుతుందన్నది ఆచరణాత్మక అనుభవం. ఏమీ కాదులే అన్న నిర్లక్ష్యం రహదారి ప్రమాదాలకు దారి తీస్తోంది. ప్రమాదానికి గురి కావడంతో వ్యక్తగతంగానే కాకుండా కుటుంబం మొత్తం కష్టాలకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంటుంది. ద్విచక్ర వాహనాన్ని నడిపేవారు, బైక్‌పై కూర్చున్నవారు సైతం హెల్మెట్‌ను ధరించడం, కారును నడిపేవారు, కారులో కూర్చున్నవారు విధిగా సీటు బెల్ట్ ధరించడం వంటి నియమాలు పాటిస్తే దాదాపుగా ప్రాణ నష్టం తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. హెల్మెట్ ధరించని వాహనదారుడి వాహనంలోకి పెట్రోల్ పోయవద్దని యూపీ సర్కార్ నిర్ణయం తీసుకోవడం హెల్మెట్ ప్రాధాన్యతను తెలియజేస్తోంది.

పట్టణాల్లో వాహనాల తాకిడి అధికం

డివిజన్ కేంద్రమైన రామచంద్రపురం పట్టణానికి సమీపాన రామచంద్రపురం రూరల్, కె.గంగవరం, కాజులూరు, రాయవరం, కపిలేశ్వరపురం, మండపేట మండలాల్లోని 120 గ్రామాలున్నాయి. రామచంద్రపురం పట్టణంలో ఆర్డీఓ కార్యాలయంతో పాటు డీఎస్పీ కార్యాలయం, విద్యుత్ డీఈ కార్యాలయం, అదనపు జిల్లా కోర్టు, ఏరియా ఆసుపత్రిలతో పాటు పలు ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. రామచంద్రపురం పట్టణానికి చేరువగా వీఎస్ఎం, కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలు, వీఎస్ఎం, మోడరన్ వికాస్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, మరో అయిదు జూనియర్ కళాశాలలు, 14 ప్రైవేటు, 14 ప్రభుత్వ ప్రాథమిక, ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మండపేట పట్టణం సమీపంలో విస్తారంగా కోళ్లఫారాలు, రైసు మిల్లులు, పరిశ్రమలు, విద్యాలయాలు విస్తారంగా ఉన్నాయి. రామచంద్రపురం, మండపేట పట్టణాలు రెండూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రమైన కాకినాడకు వెళ్లే ప్రధాన రహదారిలో ఉండటంతో నిత్యం రాకపోకలతో వాహనాల తాకిడి అధికంగా ఉంటుంది.

కె.గంగవరం: మండలంలోని పామర్రు ఎస్సై జానీ బాషా స్టేషన్ పరిధిలోని కె.గంగవరం మెయిన్‌రోడ్‌పై శనివారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించారు. ఇప్పటి వరకు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించపోవడం వల్ల ఎంతమంది ప్రాణాలు కోల్పోయారో గణాంకాలతో సహా వివరిస్తూ ప్రయాణికులను చైతన్యం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే కఠిన చర్యలు



మైనర్లకు వాహనాలిస్తే వాహన యాజమానులపై చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటాం. మానవ తప్పిదాల వలనే రహదారి ప్రమాదాలు సంభవిస్తున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. వాహన దారులు హెల్మెట్ పెట్టుకోవడం , వేగ నియంత్రణను పాటించడం వంటి నియమాలు పాటించాలి.

పి.దొరరాజు, సీఐ, మండపేట రూరల్.

180 మందికి హోమియో వైద్య సేవలు



రోగులకు హోమియో మందు వేస్తున్న రామగురెడ్డి

మండపేట: ఎస్‌బీఎస్సార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి నెల క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని శనివారం అర్తమూరులో నిర్వహించారు. అనపర్తి పీహెచ్‌సీ సూపరింటెండెంట్ తాడి రామగురెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ట్రస్టు ద్వారా బులిస్వామిరెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు పలువురికి ఆదర్శనీయమని అన్నారు. 180 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు ట్రస్టు వ్యవస్థాపకుడు సత్తి బులిస్వామి రెడ్డి తెలిపారు. రాజమండ్రి అల్లు రామలింగయ్య హోమియో హాస్పిటల్ వైద్య బృందం సేవలు అందించింది. వైద్యులు కిరణ్మయి, మానస వీర, సమీరా, మార్కండేయులు రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ సత్తి లక్ష్మణ్ రెడ్డి, కన్వీనర్ తాడి కోదండ రామారెడ్డి, సభ్యులు కోనాల సత్తిరెడ్డి, తాడి సుబ్బిరెడ్డి, తాడి శ్రీనివాస్ రెడ్డి , సీహెచ్ వెంకటకృష్ణారెడ్డి, కేబీఎస్ఎన్ రాజు, ఉద్దగిరి ఆంజనేయులు, సత్తి గోపాల్‌రెడ్డి, తేతలి ఆదిరెడ్డి, జీవీఎస్ఎన్ మూర్తి, వెలగల శివారెడ్డి, సీహెచ్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం



పసలపూడిలో త్యాగరాజ స్వామి కచేరీని ప్రారంభిస్తున్న స్థానిక నేతలు

రాయవరం: మండలంలోని పసలపూడిలో శనివారం సద్గురు త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కోటయ్య కుటుంబ సభ్యులు, శ్రీత్యాగరాజస్వామి ఆరాధన కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పెద్దల సహకారంతో ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారి చిత్రపటాన్ని గ్రామంలో మేళ తాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం త్యాగరాజస్వామి సంకీర్తన సేవను ప్రారంభించారు. స్థానిక వీవర్స్ కల్యాణ మండపంలో నిర్వహించిన సంకీర్తన సేవలో శ్రీకాకుళం నుంచి నాదస్వర విద్వాన్‌లు కె.గణేష్, టి.సంతోష్, శ్రీవాడపల్లి వెంకటేశ్వరస్వామి దేవస్థానం డోలు నిలయ విద్వాంసులు రామవరపు సుధాకర్, తిరుమల తిరుపతి దేవస్థాన విద్వాంసులు ఎస్.శ్రీనులు త్యాగరాజ కచేరిలో పాల్గొని వారి కళా ప్రతిభను ప్రదర్శించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాధరెడ్డి, ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి, పారిశ్రామికవేత్తలు చింతా కృష్ణారెడ్డి, చైతన్య రాజబాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు నల్లమిల్లి వెంకటరెడ్డి తదితరులు త్యాగరాజ కచేరీలో పాల్గొన్నారు.

అపరిశుభ్ర దుకాణాలకు జరిమానా



మెయిన్ రోడ్డు పరిసరాలను పరిశీలిస్తున్న కమిషనర్ రంగారావు

మండపేట: పట్టణంలోని మెయిన్‌రోడ్డు, కేపీ రోడ్డు, గుమ్మిలేరు రోడ్లకు ఇరువైపులా వ్యాపార దుకాణాలను శనివారం కమిషనర్ రంగారావు తనిఖీ చేశారు. అపరిశుభ్ర వాతావరణంలో ఉన్న దుకాణాలకు ఆయన అపరాధ రుసుం విధించారు. స్టేట్ బ్యాంకు వీధిలో ఉన్న టీ స్టాల్ వద్ద తాగి పారేసిన గ్లాసులతో చిందర వందరగా ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేసి రూ. 300 జరిమానా విధించారు. మరోసారి ఇదే విధంగా ఉంటే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. మన ఇంటితో పాటు చుట్టూ పరిసరాలు బాగుంటేనే ఆరోగ్యకర వాతావరణం నెలకొంటుందన్నారు. హోటళ్లు, టీ స్టాల్ వ్యాపారులు, వివిధ రకాల దుకాణా దారులు తప్పనిసరిగా రోజులో పోగుపడిన చెత్తను డస్ట్‌బిన్‌లలో వేసి పారిశుధ్య కార్మికులకు సహకరించాలని కోరారు.

రక్తదానం చేసి ప్రాణ దాతలు కండి



రక్తదానం చేసిన యువతకు ప్రశంసా పత్రాలను అందిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం: మానవత్వానికి సరికొత్త నిర్వచనం రక్త దానమని, రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 29వ వర్ధంతి సందర్భంగా రామచంద్రపురం లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని మంత్రి శనివారం ప్రారంభించారు. తొలుత పార్టీ కార్యాయలంలో ఎన్‌టీఆర్ చిత్ర పటానికి పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలో మానవ రక్తాన్ని ఉత్పత్తి చేయలేమని, రక్తదానం చేయడం ఒకటే మార్గమని మంత్రి సుభాష్ అన్నారు. త్వరలోనే రామచంద్రపురంలో రక్తనిధి ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ వైద్యులు, సిబ్బంది, శ్రీ యువసేన బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు పాల్గొని వైద్య సేవలు అందించారు. రక్తదానం చేసిన యువతకు మంత్రి సుభాష్ ప్రశంసా పత్రాలను అందజేశారు.

శ్రీరామారెడ్డి అంతిమయాత్రకు తరలిన జనం



డాక్టర్ సత్తి శ్రీరామారెడ్డి భౌతిక కాయం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, తదితరులు

శ్రద్ధాంజలి ఘటించిన ఎమ్మెల్సీ తోట, ప్రముఖులు

కాజులూరు: తీర్థయాత్రలకు వెళ్లి అరుణాచలంలో గుండెపోటుతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, గొల్లపాలెం పీఏసీఎస్ మాజీ చైర్మన్ డాక్టర్ సత్తి శ్రీరామారెడ్డి (55) అంత్యక్రియలు శనివారం ఆయన స్వగ్రామం గొల్లపాలెంలో జరిగాయి. తన భార్య, కాకినాడ జిల్లా 3వ అడిషనల్ జడ్జికోర్టు ఏపీపీ సత్తి గంగాదేవితో కలసి గత ఆరు రోజుల క్రితం తీర్థయాత్రలకు వెళ్లిన డాక్టర్ శ్రీరామారెడ్డి శుక్రవారం తెల్లవారు జామున తమిళనాడు రాష్ట్రం అరుణాచలంలో గిరి ప్రదక్షిణ చేస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందారు. శనివారం తెల్లవారు జామున శ్రీరామారెడ్డి భౌతికకాయం స్వగ్రామం చేరుకుంది. బంధుమిత్రులు, అభిమానుల ఆధ్వర్యంలో శనివారం అంతిమయాత్ర నిర్వహించి అంత్యక్రియలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ ఎంపీపీ బొడ్డు విష్ణుమూర్తి, విశ్రాంత జిల్లా బీసీ సోషల్ వెల్ఫేర్ అధికారి సనపాల ధనరాజు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు డాక్టర్ శ్రీరామారెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

కొత్తపేట: రిమాండ్‌లో ఉన్న ఖైదీలంతా సత్ప్రవర్తనతో మెలిగి, కుటుంబ సభ్యులతో కలసి సమాజంలో గౌరవంగా జీవించాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి పి.రమణారెడ్డి సూచించారు. శనివారం సాయంత్రం స్థానిక సబ్‌జైల్‌ను సందర్శించారు. జడ్జి రమణారెడ్డి సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న నిందితుల వివరాలు, బాగోగులు, వారిపై నమోదైన కేసులు, వారి కుటుంబాలు, స్థితిగతుల గురించి ఆరా తీశారు. కుల, మత, వివక్షకు తావు లేకుండా అందరూ సోదరభావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.శ్రీకర్, డీఎస్పీ వై.గోవిందరావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎం.దుర్గారావుదొర, డీఈఓ ఎస్‌కే సలీంబాషా, తహసీల్దార్ వై.రాంబాబు, ఇరిగేషన్ ఏఈ వి.నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

కపిలేశ్వరపురం: మాజీ సీఎం, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు వర్ధంతిని శనివారం పలు గ్రామాల్లో నిర్వహించారు. కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక, వల్లూరు, మాచర, వెదురుమూడి తదితర గ్రామాల్లోని ఎన్టీఆర్ నిలువెత్తు విగ్రహాలకు అభిమానులు, టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాజులూరు: టీడీపీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావుతోనే రాష్ట్రంలో రాజకీయ చైతన్యం ప్రారంభమయ్యిందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ చుండ్రు వీర్రాజుచౌదరి అన్నారు. మండలంలోని గొల్లపాలెంలో శనివారం ఆయన ఆధ్వర్యంలో నాయకులు ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు అంగర కృష్ణ, పలు గ్రామాలకు చెందిన పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

రామచంద్రపురం డీఎస్పీగా రఘువీర్



రఘువీర్

రామచంద్రపురం: రామచంద్రపురం సబ్ డివిజన్ పోలీస్ అధికారిగా బి రఘువీర్ నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన డీఎస్పీ బీ రామకృష్ణ రాజమహేంద్రవరానికి బదిలీపై వెళ్లారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. శనికి ప్రీతికరమైన శనివారం పురస్కరించుకుని దేవదాయ–ధర్మదాయ శాఖ ఉప కమిషనర్, దేవస్థానం నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ముందుగా ప్రాతఃకాల సమయంలో ఆలయ అర్చకులు, వేదపండితులు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాల టిక్కెట్ల ద్వారా దేవస్థానానికి రూ.1,84,680, అన్నప్రసాదం విరాళాలగా రూ.41,232తో మొత్తం రూ.1,84,912 ఆదాయం వచ్చినట్టు డీసీ అండ్ ఈఓ తెలిపారు.

స్వచ్ఛ సంకల్పంతో పారిశుధ్య పరిరక్షణ

- గ్రామాల్లో స్వచ్ఛ దివస్ ర్యాలీలు, మానవ హారాలు
- హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు



మండపేటలో స్వచ్ఛ దివస్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



రామచంద్రపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది



కాజులూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, అధికారులు

మండపేట: ప్రతి ఒక్కరూ పట్టణ పరిశుభ్రతకు కృషి చేసి మండపేటను సుందరంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మండపేటలో శనివారం ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ రంగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే వేగుళ్ల, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణిలు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రథం సెంటర్ నుంచి కలువ పువ్వు సెంటర్, పట్టణ వీధుల్లో స్వచ్ఛ దివస్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ ప్రజలందరి ఆరోగ్యం బాగుండాలంటే పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండాలన్నారు. ప్రతినెలా 3వ శనివారం రోజున స్వచ్ఛ భారత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. స్వచ్ఛ భారత్ విషయంలో గతంలో ఎన్నో అవార్డులు సాధించిన ఘనత మండపేట మున్సిపాలిటీకి ఉందన్నారు. అదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగుతూ మండపేటను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వైస్ చైర్మన్లు వేగుళ్ల నారయ్యబాబు, పిల్లి గనేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, టీడీపీ నాయకులు వుంగరాల రాంబాబు, చింతల శ్రీనివాస్, పెందుర్తి ప్రదీప్ కుమార్, చాపల వీరబాబు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: స్వచ్ఛ సంకల్పంతో పారిశుధ్యాన్ని పరిరక్షించుకుందామని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని కపిలేశ్వరపురంలో శనివారం «స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్» కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల, తహసీల్దార్ చిన్నారావు, ఎంపీడీఓ కె.రత్నకుమారి, కార్యదర్శి శివచక్రవర్తి, సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, సాకా శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ పువ్వల చిట్టిబాబు, సచివాలయ ఉద్యోగులు స్వచ్ఛాంధ్ర సాధనకై ప్రతిజ్ఞ చేశారు. ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ ప్రతీ మూడో శనివారం పారిశుధ్య పరిరక్షణ కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సంబంధిత శాఖల అధికారులు, ఉద్యోగులు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని 25 గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విధంగా శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏఓ చాగంటి వెంకట అచ్యుతరామ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కార్యాలయ పరిసరాలను సిబ్బందితో కలసి శుభ్రం చేశారు. కార్యాలయ ఆవరణలో ప్రతిజ్ఞ చేశారు. ఈఓపీఆర్డీ ఎన్. సెలత్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీలు, మానవ హారాలు నిర్వహించారు. ఆయా గ్రామాల పాలకవర్గాలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాజులూరు: అపారిశుధ్య వాతావరణమే అంటు వ్యాధులు ప్రబలేందుకు కారణమని, అందుకే ప్రజలు ఎల్లప్పుడూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ జె రాంబాబు అన్నారు. శనివారం మండల గ్రామాలలో అధికారులు, నాయకులు స్వచ్ఛాంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనులు నిర్వహించారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు, ఉపాధి హామీ పథకం కూలీలు గ్రామంలో చెత్త కుప్పలను, రహదారుల వెంబడి ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. నాయకులు, అధికారులు శ్రమదానం చేసి వీధులను తుడిచి శుభ్రం చేశారు. కార్యక్రమంలో భాగంగా కాజులూరులో ఎంపీడీఓ జె రాంబాబు ఆధ్వర్యంలో సిబ్బంది అవగాహన ర్యాలీ చేపట్టారు.